## క్లుప్తంగా

### వెంకన్నకు ప్రత్యేక పూజలు


పూజలందుకున్న వేంకటేశ్వరస్వామి

పెందుర్తి: వెంకటాద్రిపై కొలువుదీరిన వేంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం అనంతరం తోమాల సేవ జరిపారు. సహస్ర నామార్చన, అష్టోత్తరం, దూపసేవ నిర్వహించారు. వెంకన్న సన్నిధిలో భక్తులు తులాభారం నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తుల కోసం వెంకటాద్రి దిగువ నుంచి ఉచిత రవాణా సదుపాయం కల్పించారు. ప్రసాద వితరణ చేపట్టారు.

### పాదయాత్రను విజయవంతం చేయండి

పరవాడ: ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివారం నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ కోరారు. ఉక్కు పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో కూర్మన్నపాలెం కూడలి నుంచి పాదయాత్ర ప్రారంభమైన గాంధీ విగ్రహం వద్ద ముగుస్తుందని చెప్పారు. పాదయాత్రలో అన్ని ప్రభుత్వ రంగ సంస్థల ఉద్యోగులు, కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ మేరకు ఎన్టీపీసీ మెయిన్‌గేటు వద్ద కరపత్రాలు పంపిణీ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను కాపాడుకోవడానికి కార్మికులు, ప్రజలు పోరాటాలకు సిద్ధం కావాలని గనిశెట్టి పిలుపునిచ్చారు.

### 76 మందికి కంటి వైద్య పరీక్షలు


నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

పెందుర్తి: డాక్టర్ వైఎస్సార్ కంటి వెలుగు పథకంలో భాగంగా జిల్లా అంధత్వ నివారణ సంస్థ, శంకర్ ఫౌండేషన్ సంయుక్తంగా శనివారం గొరపల్లిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి చక్కటి స్పందన లభించింది. శంకర్ ఫౌండేషన్ వైద్య బృందం మొత్తం 76 మందికి కంటి పరీక్షలు చేశారు. అందులో 20 మందిని కాటరాక్ట్ శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశారు. వారికి ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా శస్త్ర చికిత్స చేయనున్నారు. సర్పంచ్ గొరపల్లి శ్రీను చేతుల మీదుగా మందులు పంపిణీ చేశారు. శంకర్ ఫౌండేషన్ ఆప్తాలమిక్ అధికారి హరిచందన, క్యాంప్ కో ఆర్డినేటర్ వై.పైడిరాజు, దేవి తదితరులు పాల్గొన్నారు.

### ముగిసిన సీతారామాలయ వార్షికోత్సవాలు


సీతారాములకు పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు సింహపురికాలనీలో నిర్వహిస్తున్న సీతారామాలయ 21వ వార్షికోత్సవాలు శనివారంతో ఘనంగా ముగిశాయి. ఉదయం ధ్వజావరోహణం, స్వామివారికి స్నపన తిరుమంజనం,చక్రస్నానం, వసంతోత్సవం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం శ్రీ పుష్పయాగం, ద్వాదశారాధన, ఊంజల్ సేవ ఆలయ ప్రధానార్చకుడు హరి ప్రసాద్ చేశారు. ఆదివారం నుంచి ఈనెల 10వతేదీ వరకు ఉపాలయాల వార్షికోత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

### ఉత్సాహంగా ఉక్కు మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ మహిళా ఉద్యోగుల స్పోర్ట్స్ మీట్ రెండు రోజుల పాటు ఉత్సాహంగా జరిగింది. స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగం, విమెన్ ఇన్ పబ్లిక్ సెక్టార్ (విప్స్) సంయుక్త ఆధ్వర్యంలో ఉక్కు స్టేడియంలో క్రికెట్, బ్యాడ్మింటన్, షాట్‌పుట్, జావెలిన్ త్రో తదితర పోటీలు నిర్వహించారు. విజేతలకు స్టీల్‌ప్లాంట్ సీజీఎం (వర్క్స్) ఎ.కె.సోబ్టీ చేతులమీదుగా బహుమతులు అందజేశారు. ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు ఎక్కువ సంఖ్యలో పోటీల్లో పాల్గోవడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ విభాగం ఇన్‌చార్జ్ సీజీఎం డాక్టర్ కె.హెచ్.ప్రకాశ్, ఏసీఏస్ విభాగాధిపతి వి.చిట్టిబాబు, విప్స్ కో–ఆర్డినేటర్ కె.ఎస్.చంద్రావతి, స్పోర్ట్స్ విభాగం అధికారులు పాల్గొన్నారు.



# రావాలమ్మా.. చల్లగ చూడమ్మా


రావాలమ్మ అమ్మవారు


రావాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్

సబ్బవరం: మండలంలోని మల్లునాయుడుపాలెం గ్రామంలో పునర్నిర్మించిన రావాలమ్మ అమ్మవారి ఆలయ, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని శనివారం వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్ఛరణలతో శాస్త్రోక్తంగా సర్పంచ్ బోను దేవుడమ్మ,గంగునాయుడు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేశారు. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్‌తో కలిసి అమ్మవారి ఆలయాన్ని ప్రారంభించారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారి సన్నిధిలో నిర్వహించిన భారీ అన్న సమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు అన్నప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. అమ్మవారిని వారిని దర్శించుకున్న వారిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చొక్కాకుల వెంకటరావు, ఎంపీపీ బోకం సూర్యకుమారి,వైస్ ఎంపీపీ చొక్కాకుల గోవింద్, మాజీ ఎమ్మెల్యే గండి బాబ్జీ, జిల్లా వీఆర్వోల సంఘం అధ్యక్షుడు సబ్బవరపు త్రినాథ రామకాసు, నాయకులు బోకం రామునాయుడు,సబ్బవరపు నారాయణమూర్తి, ఎంపీటీసీ గొర్లి కనకరాజు ఉన్నారు.

# పల్స్ పోలియోపై అవగాహన


పరవాడలో ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పరవాడ: స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఆదివారం నిర్వహిస్తున్న పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ జయశ్రీ కరిష్మా కోరారు. పల్స్‌పోలియో కార్యక్రమంపై శనివారం పరవాడలో వైద్య సిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ కరిష్మా మాట్లాడుతూ అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులకు పోలియో వ్యాధి రాకుండా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పీహెచ్‌సీ పరిధిలో 13 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసి 1548 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమం డాక్టర్ హారిక పర్యవేక్షణలో జరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ అధికారి ఎం.ఎస్.ఎస్.సాయిరాం, పీహెచ్ఎన్ జానికీరామన్, సూపర్‌వైజర్లు సతీష్, కుమార్, పి.వి.రత్నం, ఎం.శ్రీనివాస్, ఆశ కార్యకర్తలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- గురుకుల కేంద్రాన్ని పరిశీలించిన ఎస్పీ మురళీకృష్ణ


గురుకుల పాఠశాలలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ మురళీ కృష్ణ

సబ్బవరం: మండలంలోని సబ్బవరంలో నిర్వహిస్తున్న ఇంటర్మీడియట్ పరీక్షలు రెండో రోజు శనివారం ప్రశాంతంగా జరిగాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నిర్వహిసున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాన్ని అనకాపల్లి ఎస్పీ మురళీకృష్ణ సందర్శించారు. కేంద్రంలో ఏర్పాట్లను,పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించారు. కళాశాలలో నిర్వహించిన రెండో రోజు తెలుగు,సాంస్కృతం పరీక్షలకు 245 మంది హాజరు కావాల్సి ఉండగా 9 మంది గైర్హాజరయ్యారని సూరింటెండెంట్ సత్యారావు తెలిపారు.

# నేడు కూడా సామాజిక తనిఖీలు

మహారాణిపేట : జిల్లాలో రబీ 2023–24 సీజన్‌కు సంబంధించి ఇ–క్రాప్ ముసాయిదా జాబితా మీద ఆదివారం కూడా సామాజిక తనిఖీ కోసం గ్రామసభలో ప్రదర్శన ఉంటుందని జిల్లా వ్యవసాయ అధికారి కె.అప్పలస్వామి ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 1 నుంచి 3వ తేదీ వరకు ఇది కొనసాగుతుందని తెలిపారు. ఇ–క్రాప్ రబీ సీజన్ సవరణకు ఇదే చివరి అవకాశం అని, తుది జాబితా ప్రదర్శన తర్వాత ఎలాంటి మార్పులు, చేర్పులు చేయడానికి వీలు లేదన్నారు. జిల్లాలో 2023–24 రబీ సీజన్‌లో 4496 ఎకరాల ఇ–క్రాప్ నమోదు చేశామని, ఇందులో 4473 ఎకరాలకు 2673 మంది రైతులకు ఈకేవైసీ చేశామన్నారు. అభ్యంతరాలు ఏవైనా ఉంటే అధికారులను సంప్రదించి రాత పూర్వకంగా తెలపాలన్నారు. రైతు భరోసా కేంద్రం అధికారి ఈ అభ్యంతరాలను పరిశీలిస్తారన్నారు. మండల వ్యవసాయ అధికారి, తహసీల్దార్ ఆమోదం కోసం ఈనెల 5లోగా తుది జాబితాలో చేర్చనున్నట్లు తెలిపారు.

# ‘కార్పొరేట్ శక్తులకు బీజేపీ ఊడిగం’


దీక్ష శిబిరంలో మాట్లాడుతున్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ కార్మికుల భవిష్యత్తును అంధకారంలోకి నెడుతోందని విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ ఆధ్వర్యంలో స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద చేపట్టిన రిలే నిరాహార దీక్షల్లో 1115వ రోజు, శనివారం సంస్థలోని వివిధ విభాగాల కార్మికులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ ఉక్కు ఉద్యమంపై ప్రభుత్వ అణచివేత పెరుగుతున్న కొద్దీ ప్రజల్లో వ్యతిరేకత పెరిగి బీజేపీ రాజకీయ మనుగడ ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఉద్యమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా రాజకీయ అంశంగా మలచే దిశగా కార్మికవర్గం అడుగులు వేయాలన్నారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో క్విట్ కార్పొరేట్ నినాదంతో నేడు దీక్షా శిబిరం నుంచి నగరంలోని జీవీఎంసీ గాంధీ విగ్రహం వరకు జరగనున్న పాదయాత్ర కార్యక్రమంలో కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

## ద్వారకా తిరుమలలో చోరీ

- గాజువాకకు చెందిన భక్తుడి కారులోని బంగారు వస్తువులు మాయం


వివరాలు సేకరిస్తున్న ఎస్‌ఐ సతీష్

ద్వారకాతిరుమల: శ్రీవారి దర్శనార్థం క్షేత్రానికి విచ్చేసిన ఒక దంపతులు తమ వద్ద ఉన్న 17 కాసుల బంగారు నగలను కారులో ఉంచి, స్వామివారి దర్శనానికి వెళ్లి, తిరిగి వచ్చేసరికి ఆ బంగారు నగలు చోరీకి గురయ్యాయి. ఈ ఘటన శనివారం ఉదయం కొండపైన సెంట్రల్ పార్కింగ్‌లో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం విశాఖపట్నం జిల్లా పాత గాజువాక లోని సమతా నగర్‌కు చెందిన కిరీటం సత్య భాస్కరరావు, కొత్త అన్నపూర్ణ విశాలాక్షి దంపతులు రావులపాలెంలోని ఒక వివాహ వేడుకకు హాజరై, అక్కడి నుంచి నేరుగా ఉదయం తమ కారులో శ్రీవారి దర్శనార్థం ద్వారకాతిరుమల క్షేత్రానికి వచ్చారు. తమ వద్ద ఉన్న 17 కాసుల 02 గ్రాముల బరువైన రాళ్లు పొదిగిన రెండు జతల బంగారు చెవి దిద్దులు, రాళ్లు పొదిగిన నాలుగు బంగారు గాజులు, నాలుగు పేటల బంగారు పరకసరల గొలుసు, రాళ్లు పొదిగిన బంగారు నెక్లెస్, ఒక బంగారు హారాన్ని పర్సులో పెట్టి దాన్ని తమ కారు సీటు కింద పెట్టారు. ఆ కారును సెంట్రల్ పార్కింగ్‌లో పార్క్ చేసి దర్శనానికి వెళ్లారు. మధ్యాహ్నం తిరుగు ప్రయాణం అయ్యేందుకు కారు ఎక్కిన బాధిత దంపతులకు బంగారు వస్తువులు పెట్టిన పర్సు కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందించారు. భీమడోలు సీఐ భీమేశ్వర రవికుమార్, ద్వారకా తిరుమల ఎస్‌ఐ జి.సతీష్ బాధితుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం దేవస్థానం సీసీ కెమెరాల పుటేజీలను పరిశీలించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పాన్‌షాప్ దగ్ధం



సింహాచలం: అడవివరం పాతగోశాల సమీపంలోని రోడ్డు పక్కన ఉన్న పాన్‌షాప్ శనివారం రాత్రి 11 గంటల సమయంలో షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. బడ్డీలో నుంచి ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో స్థానికులు అగ్నిమాపక సిబ్బందికి సమాచారం ఇచ్చారు. మర్రిపాలెం అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను అదుపు చేశారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి


శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు జ్ఞాపికలు అందిస్తున్న శ్రీలిఖి ప్రతినిధులు

పెందుర్తి: మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించాలని గైనికాలజిస్ట్ డాక్టర్ శిరీష అన్నారు. నాబార్డ్ ఆధ్వర్యంలో శ్రీలిఖి ఉమెన్ వెల్ఫేర్ అసోసియేషన్ పెందుర్తి డీడీయూజీకేవై కేంద్రంలో శనివారం మహిళలకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, కౌమారదశ బాలికలు వ్యక్తిగత పరిశుభ్రతపై శ్రద్ధ వహించాలని సూచించారు. డీడీయుజీకేవై కేంద్రంలో శిక్షణ పొందిన వారికి పత్రాలు, జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో నాబార్డ్ డీడీఎం సామంత్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## ఐమాస్ట్ లైట్లు ప్రారంభం


ఐమాస్ట్ లైట్లను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ ముమ్మన దేముడు

పెందుర్తి: జీవీఎంసీ 95వ వార్డు లక్ష్మీపురం దరి దుర్గానగర్ రైల్వే ఫ్లై ఓవర్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన ఐమాస్ట్ లైట్లను శనివారం కార్పొరేటర్ ముమ్మన దేముడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్డులోని మరో పది చోట్ల రూ.10.35 లక్షల జీవీఎంసీ నిధులతో ఐమాస్ట్ దీపాలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## కూచిపూడి పితామహుడి పేరిట స్మారక పురస్కారం

- సొంత నిధుల నుంచి విరాళం అందించిన ఆచార్య సరస్వతి విద్యార్థి


ఏయూ వీసీ ప్రసాదరెడ్డికి విరాళం డీడీ అందిస్తున్న ఆచార్య సరస్వతి

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం నృత్య విభాగంలో స్మారక బహుమతిని ఏర్పాటు చేశారు. విభాగ ఆచార్యురాలు కె.సరస్వతి విద్యార్థి తన సొంత నిధుల నుంచి రూ 1.5 లక్షలు విరాళంగా అందించి ‘కూచిపూడి పితామహ శ్రీ సిద్దేంద్రయోగి మెమోరియల్ ప్రైజ్’ ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ మేరకు శనివారం ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డిని ఆమె కలిసి ప్రైజ్ ఏర్పాటుకు అవసరమైన నిధులకు సంబంధించిన డీడీని అందించారు. విభాగంలో ఎంఏ డ్యాన్స్‌లో మొదటి ర్యాంక్ సాధించిన విద్యార్థికి ఈ ప్రైజ్ ఇవ్వాలని సరస్వతి కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు పాల్గొన్నారు.

## మహా పాదయాత్ర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

పెదగంట్యాడ: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేట్ పరం చేయవద్దని కోరుతూ అఖిలపక్ష సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం కూర్మన్నపాలెం జంక్షన్ నుంచి జీవీఎంసీ ప్రధాన కార్యాలయం వరకు నిర్వహించనున్న మహా పాదయాత్రను జయప్రదం చేయాలని నాయకులు కోరారు. ఈ మేరకు గంగవరం పోర్టు వంతెన వద్ద శనివారం ఆందోళన చేశారు. పాదయాత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. పులి రమణారెడ్డి, దొమ్మేటి అప్పారావు, శ్రీనివాసరావు, నమ్మి అప్పారావు పాల్గొన్నారు.

**పాదయాత్రకు రాజకీయ పార్టీల మద్దతు**

ఉక్కునగరం: మహా పాదయాత్రకు వివిధ రాజకీయ పార్టీలు మద్దతు తెలిపాయి. ఈ మేరకు గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, జనసేన నాయకుడు కోన తాతారావు పరిరక్షణ కమిటీకి లేఖలు అందజేశారు. గాజువాక ఎమ్మెల్యే నాగిరెడ్డి పంపిన లేఖలో తమ పార్టీ ఉక్కు ఉద్యమానికి పూర్తి మద్దతు ఇస్తోందని, పాదయాత్రలో పాల్గొని కార్మికుల పక్షాన మద్దతు ఇస్తానని తెలియజేశారు.

# అట్టహాసంగా రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు

- రెండోరోజు శిఖర యంత్ర ,త్రిరాత్రి పూజలు
- కోట్నీవానిపాలెంలో ఆధ్యాత్మిక సందడి


పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు, వేదపండితులు


విగ్రహాలకు జలాధివాసం చేస్తున్న భక్తులు

పెందుర్తి: మండలంలోని కోట్నీవానిపాలెంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. గ్రామంలో నూతనంగా నిర్మించి సంపత్ వినాయక పూర్వక సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సహిత కోదండ రామాలయ ప్రతిష్టాపనోత్సవాలు రెండు రోజులుగా వైభవంగా నిర్వహిస్తున్నారు. శిఖర యంత్ర మహోత్సవాల్లో భాగంగా రెండో రోజు శనివారం ప్రత్యేక కార్యక్రమాలు జరిగాయి. ఆలయ శిఖర యంత్రాలకు పూర్ణకలశాలతో భక్తులు జలాధివాసం చేశారు. ముందుగా గ్రామ పురవీధుల్లో మూలవిరాట్‌లు, శిఖర యంత్రాలను ఊరేగించారు. వందలాదిగా మహిళలు పూర్ణ కలశాలతో ఊరేగింపులో పాల్గొన్నారు. అనంతరం వేద మంత్రోచ్ఛరణల నడుమ మూలవిరాట్‌లకు జలాధివాసం, క్షీరాభిషేకం, పూలాభిషేకం జరిపారు. అగ్ని ప్రతిష్ట చేశారు. సాయంత్రం నుంచి విగ్రహాలకు ధాన్యధివాసం, అష్టదిక్‌బలి, పంచ శయ్యాదివాసం జరిపి మంగళ హారతులిచ్చారు. యాగశాలలో హోమాలు జరిపారు. ఉత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు ఆదివారం ఉదయం 9.49 గంటలకు విగ్రహ, శిఖర ప్రతిష్ట చేయనున్నారు. మధ్యాహ్నం రామాలయం ప్రాంగణంలో భారీ ఎత్తున అన్నసమారాధన నిర్వహించనున్నారు. సాయంత్రం శాంతి కల్యాణం చేస్తారు. కోలాటాలు, గరిడీలు, మేళతాళాలు, తప్పెటగుళ్లు, మందుగుండు సామగ్రి నడుమ సీతారాముల ఉత్సవ మూర్తుల పల్లకీ ఊరేగింపు చేస్తామని ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

# చురుగ్గా దుర్గమాంబ ఆలయ నిర్మాణం


దుర్గమాంబ విగ్రహం

పరవాడ: వెన్నలపాలెం గ్రామంలో సుమారు రూ.65 లక్షలతో దుర్గమాంబ ఆలయ నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏప్రిల్‌లో నిర్వహించనున్న అమ్మవారి పండగ నాటికి ఆలయ నిర్మాణం పూర్తి చేయాలన్న లక్ష్యంతో నిర్మాణ పనులు వేగవంతం చేశారు. ఆలయ నిర్మాణ, అమ్మవారి విగ్రహ పనులు దాదాపు పూర్తయ్యాయి. ప్రస్తుతం ఆలయ ముందు పోతిరాజు విగ్రహ పనులు సాగుతున్నాయి. అమ్మవారి ఆలయానికి భక్తులు రాకపోకలు సాగించేందుకు అవసరమైన సీసీ రోడ్డు ఏర్పాటు చేశారు.

**దాతలు సహకరించాలి**

దుర్గమాంబ ఆలయ నిర్మాణానికి దాతల సహకరించాలని వెన్నలపాలెం సర్పంచ్ వెన్నల అప్పారావు కోరారు. ఏప్రిల్ నాటికల్లా నిర్మాణం పూర్తి చేసి పండగ నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు.

# అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు


పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్టింపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అర్చకులు అందజేశారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం గరుడసేవ వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వెండి గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టింపజేశారు. అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

# ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన


సత్యం జంక్షన్‌లో చోదకులకు అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు

సీతమ్మధార: పాత్ర సంస్థ ఆధ్వర్యంలో శనివారం సత్యం జంక్షన్‌లో ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు సమక్షంలో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీసీపీ మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులంతా విధిగా హెల్మెట్ ధరించాలని, కారు డ్రైవ్ చేసే వారు సీట్‌బెల్ట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, వాహనాలకు సంబంధించిన పత్రాలు వెంట ఉండాలని సూచించారు. అతివేగంగా వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమైన వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మైనర్లు వాహనాలు నడపరాదని, 18 ఏళ్లు నిండిన వారు డ్రైవింగ్ లైసెన్స్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ద్వారకా ట్రాఫిక్ ఎస్‌ఐ ఎన్.వి.భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

**బిర్లా జంక్షన్‌లో..**

మర్రిపాలెం: రోడ్ల మీద ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్‌పై అవగాహన కలిగి ఉండాలని ట్రాఫిక్ ఏడీసీపీ జి.శ్రీనివాసరావు అన్నారు. జాతీయ రహదారి బిర్లా జంక్షన్‌లో శనివారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పోలీసు శాఖ పాత్ర బీపీవో సంస్థ సహాయంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ అవగాహన కలిగిన వారికి పోలీసులు బహుమతులు అందజేశారు. ట్రాఫిక్ ఏసీపీ రాజీవ్ కుమార్, కంచరపాలెం ట్రాఫిక్ సీఐ ప్రసాదరావు, శాంతిభద్రతల సీఐ భాస్కరరావు, ఎయిర్‌పోర్టు సీఐ చక్రధర్ తదితరులు పాల్గొన్నారు.

# ‘మెటీరియల్స్ అండ్ టెక్నాలజీస్’పై సదస్సు

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం సివిల్ ఇంజినీరింగ్ విభాగంలో శనివారం మౌలిక సదుపాయాల కల్పన ప్రాజెక్టుల్లో మెటీరియల్స్ అండ్ టెక్నాలజీల వినియోగం అంశంపై ఒకరోజు జాతీయ సదస్సు నిర్వహించారు. ఏయూ ఇంజినీరింగ్ కళాశాల, ఇండియన్ జియోటెక్నికల్ సొసైటీ, ఇండియన్ కాంక్రీట్ ఇన్‌స్టిట్యూట్ వైజాగ్ చాప్టర్ విశాఖ ప్రాంతీయ కేంద్రాలు సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించాయి. ఐఐటీ మద్రాసు సివిల్ ఇంజినీరింగ్ విభాగ విశ్రాంత ఆచార్యులు రాజగోపాల్ స్థిరమైన నిర్మాణాల కోసం జియోసింథటిక్స్ వియోగంపై ప్రసంగించారు. జాతీయ రహదారులు, రైల్వే నిర్మాణాలు, పేవ్‌మెంట్ల నిర్మాణం వంటివి పలు ఉదాహరణలతో వివరిస్తూ జియో సింథటిక్స్ ఉపయోగాలు, అనువర్తనాలను తెలియజేశారు. స్త్రీజా గ్లోబల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో బి.వి.నాగరాజ్ కుమార్ మాట్లాడుతూ ఎత్తయిన వాణిజ్య నిర్మాణాలు, బ్రిడ్జిల నిర్మాణాల విధానాన్ని వివరించారు. అల్ట్రాటెక్ సిమెంట్ ఏజీఎం(టెక్నికల్) కె.వెంకట రామన్ మాట్లాడుతూ తీర ప్రాంతాల్లో కాంక్రీట్ నిర్మాణాల మరమ్మతులు, నిర్వహణ వ్యయాన్ని తగ్గిస్తూ వాటి జీవిత కాలాన్ని పెంచడంలో కాంక్రీట్ ప్రాముఖ్యాన్ని తెలియజేశారు. కార్యక్రమానికి విభాగాధిపతి ఆచార్య సి.ఎస్.వి.సత్యనారాయణ అధ్యక్షత వహించారు. ఆచార్య కె.శ్రీనివాసరావు, ఆచార్య పి.వి.వి.సత్యనారాయణ, ఆచార్య కె.దుర్గారాణి, ఆచార్య ఆదిశేషు, డాక్టర్ కె.రాజశేఖర్, వివిధ కళాశాల అధ్యాపకులు, పరిశోధకులు, పలు ప్రభుత్వ రంగ సంస్థల ఇంజినీర్లు పాల్గొన్నారు.